"ఏమండీ - ఏమండీ" - భాగ్యం పరమేశ్వరాన్ని కుదుపుతూ తట్టి లేపింది. కంగారుగా లేచాడు. "ఏమిటి భాగ్యం" అన్నాడు అయోమయంగా చూస్తూ.

తారుమారు

- కె. శ్రీలక్ష్మీశైలజ



"బాబు... కడుపునొప్పి అని మెలికలు తిరిగిపోతున్నాడండీ - నా కేమిటో భయంగా ఉంది. త్వరగా డాక్టరు దగ్గరికి వెళదాం పదండి..." వణుకుతున్న గొంతుతో అంది.

"పద పద..." అని చప్పున బట్టలు వేసుకుని పిల్లాడిని జుజాన వేసుకుని బయల్దేరాడు. వెంట భాగ్యం అనుసరించింది. రాత్రి పదకొండు గంటల యింది. రోడ్డుమీద మనుషులు ఎక్కువగా లేరు. అదృష్ట వశాత్తు రిక్షా ఒకటి దొరికింది.

మరో అరగంటలో ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడ నర్సు వరండాలో చల్లగాలికి కూర్చుని, తాపీగా ట్రాన్సిస్టరు వింటోంది.

పరమేశ్వరం కంగారుగా నర్సు దగ్గరకెళ్ళి "సిస్టర్! డాక్టరుగారున్నారా?" అనడిగాడు ఆత్రంగా.

"ఏమిటి హడావిడి? పిల్లాడికేమయింది?" తాపీగా అడిగింది.

"కడుపులో నొప్పి అని ఏడుస్తున్నాడు."

"ఈ మాత్రానికి డాక్టరు దగ్గరికి రావాలా? కస్తూరి మాత్ర వేస్తే సరిపోయేదిగా?"

ఆ మాటలకి కోపం ముంచుకొస్తున్నా, బలవంతాన నిగ్రహించుకుని "మామూలు కడుపునొప్పిలా లేదు సిస్టర్. అందుకే వచ్చాం" అన్నాడు.

"మామూలు కడుపునొప్పి అవునో, కాదో మీకెలా తెలుసు?"

"సిస్టర్! ప్లీజ్... మాటల్తో టైము వేస్టు చెయ్యకండి. ముందు డాక్టరుకి కబురు చేయండి..."

మొహం మాడ్చుకుని "సరే - అలా బల్లమీద కూర్చోండి" అని డాక్టరుని పిలవడానికి వెళ్ళింది.

మరో అయిదు నిముషాల్లో మేడమీద నుంచి డాక్టరు దిగి వచ్చారు. పిల్లవాడిని పరీక్ష చేసి "వెంటనే ఆపరేషను చేయాలి... పిల్లాడు అపెండిసైటీస్‌తో బాధపడుతున్నాడు..." అన్నాడు డాక్టర్.

పరమేశ్వరం షాక్ తిన్నాడు.

అయితే - తాను భయపడినదంతా అయిందన్నమాట! నుదిటిమీద చెమట తుడుచుకుంటూ "ఆపరేషన్ చెయ్యక తప్పదా డాక్టరుగారూ?" అనడిగాడు దీనంగా.

"పిల్లాడు దక్కాలంటే ఆపరేషన్ తప్పదు!"

"ఎంతవుతుంది?"

"ముందు రెండు వేలు కట్టాలి."

"రెండు వేలా?" విస్తుబోయాడు.

"అవును! త్వరగా తేల్చి చెప్పండి. డబ్బులు కట్టగలరా? లేకపోతే గవర్నమెంటు ఆస్పత్రికి తీసుకెళ్ళండి."

"రేపు ఎలాగోలా తెచ్చి కడతాను. పిల్లాడికి ఆపరేషన్ చేసి రక్షించండి - ". ప్రాధేయపడ్డాడు.

"సారీ! వీలుపడదు... నా కన్సల్టేషన్ ఫీజు యాభై రూపాయలు నర్స్‌కిచ్చి మీరు వెళ్లచ్చు..." తిరిగి ఇంట్లోకి వెళ్ళబోతున్న డాక్టర్ని ఆందోళనతో అడ్డుకుంది భాగ్యం.

"మీక్కావలసింది డబ్బేగా? ఇదుగో ఈ మంగళసూత్రం మీ దగ్గర ఉంచుకోండి. మావారు డబ్బులిచ్చాక తిరిగి ఇవ్వండి... ముందు ఆపరేషన్ చెయ్యండి..." అంది.

"మీరు రాసిన కథలు ఎందులో వస్తుంటాయి" అడిగింది రాణి.
"తిరుగుటపాలో" పొడిగా చెప్పింది రచయిత్రి మిసెస్ ఎ.వి.రావు

రాయవరపు రవి
రామాయంపేట

"నాకివన్నీ ఎందుకు!! అంతగా అయితే, ఆ మంగళసూత్రమే తాకట్టు పెట్టి డబ్బు తీసుకురండి."

"అలాగే! ఇదుగోండి మంగళసూత్రం. మీరు వెంటనే వెళ్ళి డబ్బు తీసుకురండి... అందాక బాబుని నేను చూస్తుంటాను..." అని పిల్లాడిని అందుకుంది.

పరమేశ్వరం కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి. గొంతు మూగపోయింది. కళ్ళతోనే వేదనాభరితంగా అతను వేస్తున్న ప్రశ్నలు గ్రహించి, "వెళ్లండి... ముందు మన బాబుని దక్కించుకోవాలి. వాడులేని ప్రపంచం మనకొద్దు..." అంది బాధగా.

పరమేశ్వరం వడివడిగా వెళ్ళాడు.

* * *

కాలం పరుగుల్లో క్యాలెండర్లు మారిపోయాయి. పరమేశ్వరం పరిస్థితి క్రమంగా మెరుగుపడింది. ఇప్పుడతను స్వయంగా "ట్యూటోరియల్స్" నడుపుతున్నాడు. అక్కడి విద్యార్థులు మొదటి ర్యాంకుల్లో నిలుస్తున్నారు. ప్రతి పోటీలో వాళ్ళే గెలుస్తున్నారు.

పరమేశ్వరం పేరు బాగా ప్రసిద్ధి అయింది.

అప్పుడు - ఒక సాయంత్రం - ఇంటిముందు లాన్‌లో కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్న పరమేశ్వరాన్ని కలుసుకోవటానికి ఒక వ్యక్తి వచ్చాడు.

"నమస్కారం మాష్టారూ!"

పరమేశ్వరం తలెత్తి చూశాడు.

అతని మొహంలో రంగులు మారాయి.

కవళికలు కర్కశంగా మారిపోయాయి. ఆ రోజు తన చేత భార్య మాంగల్యాన్ని తాకట్టు పెట్టించిన డాక్టరు!

"మీకు ఎవరు కావాలి?" కోపాన్ని అణుచుకుంటూ ప్రశ్నించాడు.

"మీరే మాష్టారూ! మీకోసమే వచ్చాను..." మందహాసంతో ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. పరమేశ్వరం అతని ధోరణికి ఆశ్చర్యపడ్డాడు! తనెవరో గుర్తులేనట్లే ప్రవర్తిస్తున్నాడు... "దుర్మార్గుడు" - కసిగా అనుకుని, పైకి మామూలుగా మొహం పెట్టి, "ఊఁ... చెప్పండి... ఏమిటి విషయం" అన్నాడు.

అతను నవ్వాడు.

"డాక్టరు దగ్గరికి పేషంట్లు, మాష్టారు దగ్గరికి విద్యార్థులు రావటంలో ప్రత్యేకత ఏముంది సార్!" అన్నాడు.

"మీరు ఏమంటున్నారో నా కర్థం కావటం లేదు!"

"వెరీ సింపుల్! నేనుమా అబ్బాయిని మీ దగ్గర చదివిద్దామనుకుంటున్నాను. పిల్లాడు తెలివి కలవాడే కానీ, చెడు స్నేహాలు పట్టి చెడిపోతున్నాడు. మీ దగ్గర పిల్లలు మెరిట్‌లో ప్యాసవుతారని ప్రతీతి. అందువల్ల మా అబ్బాయిని కూడా..."

పరమేశ్వరానికి సంతోషం కలిగింది.

"ఇతగాడికి గుణపాఠం నేర్పే అవకాశం దేవుడు తనకిచ్చాడన్నమాట. చెబుతాను - మనసులో అనుకుని, "సారీ! నేను ఒక పద్ధతి ప్రకారం సంస్థ నడుపుతున్నాను. క్లాసుకి ముప్పైమంది విద్యార్థులకంటే ఎక్కువ జేర్చుకోను. సీట్లన్నీ అయిపోయినాయి..." అన్నాడు.

అతని మొహం నల్లబడింది.

నవ్వు మాయమైంది.

ప్రాధేయపూర్వకంగా "ప్లీజ్! ఏదో విధంగా మావాడికి సీటు ఇప్పించండి. మీ మేలు మర్చిపోను... ప్లీజ్" అడిగాడు.

"చెప్పానుగా - చాలా కష్టం!

"మీరలాగంటే ఎలా సార్... కాస్త కనికరించండి... నాకు ఒక్కగానొక్క కొడుకు... లక్షల ఆస్తి... అప్రయోజకుడైపోతే అంతకంటే నాకు వేరే శిక్ష లేదు... ప్లీజ్ - కాస్త దయచూపండి."

"దయ... కనికరం..." నవ్వేడు పరమేశ్వరం. "మీరు నమ్మని విషయాలు నాకెందుకు చెబుతున్నారు డాక్టర్!" అన్నాడు.

"మాస్టారూ! అర్థం కానట్టు చూశాడు డాక్టరు.

"బహుశ; మీకు నేను గుర్తులేననుకుంటాను. అవునైండి! ఎలా గుర్తుంటాను? మీరు మాంగల్యాలు అమ్మించిన వందలమంది తండ్రుల్లో నేనూఒకణ్ణి. అలా సంపాయించిన లక్షల డబ్బు... మీకెలా నిలుస్తుంది డాక్టర్! అప్రయోజకుడైన కొడుకు ఒక శాపం! అది మాలాంటి తల్లిదండ్రుల బాధాశ్రువులు పలికిన శాపం... మీ తప్పుల మూల్యాన్ని మీరు చెల్లిస్తున్నారు... అంతే!"

డాక్టరు కళ్లముందు గతం మెదిలింది.

ఆ రాత్రి - పిల్లవాడితో తల్లిదండ్రులు రావటం పిల్లవాడికి ఆపరేషన్ గురించి తను రెండు వేలు ఇవ్వాలని ఖండితంగా అడగటం - ఆ తల్లి మాంగల్యం తన చేతిలో పెట్టటం... డాక్టరు మనసులో ఇన్నాళ్ళు నిద్రపోయిన మానవత్వం మేలుకుంది.

పశ్చాత్తాపం నిండిన చూపుల్తో చేతులు జోడించి "నా తప్పు గ్రహించాను మాస్టారూ! డబ్బే ధ్యేయంగా మానత్వం లేని పశువుగా ప్రవర్తించాను. క్షమించమని మిమ్మల్ని అడిగే అర్హత కూడా నాకు లేదు. వస్తాను! వెళ్ళేముందు ఒక హామీ ఇచ్చి మరీ వెళ్తాను. ఈ క్షణం నుంచి నేనూ మానవత్వంతో ప్రవర్తిస్తాను. నాతోటి మానవుల్ని పీడించటం మానివేస్తాను" అని వెళ్ళిపోతున్న డాక్టర్‌ని వెనకనుంచి పిలిచాడు పరమేశ్వరం.

"డాక్టరుగారూ! మీ పశ్చాత్తాపంతో తప్పులన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. రేపట్నుంచీ మీ పిల్లవాడిని పంపంపించండి..." అన్నాడు.

డాక్టరు కళ్ళు ఆనందంతో చెమ్మగిల్లాయి. "చాలా థాంక్స్ మాస్టారూ! మీ మంచితనమే నాకు ఆదర్శం... వస్తాను" అని వడివడిగా వెళ్ళిపోయాడు.

పరమేశ్వరం తనవల్ల ఒక వ్యక్తిలో మార్పు కలిగి మంచితనం పరిమళిస్తున్నందుకు తృప్తి పడ్డాడు. ఉపాధ్యాయుడిగా విద్యార్థుల్ని తీర్చిదిద్దడమే కాక బాధ్యత గల పౌరుడిగా సమయమెరిగి ఒక వ్యక్తిని అదీ సమాజానికి ఎంతో విలువైన ఒక డాక్టర్ని మార్చినందుకు ఎంతో ఆనందించాడు. ★